| మంచిర్యాల | |
|---|---|
| సంవత్సరం | 2023 |
| సమకూరిన ఆదాయం | రూ. 72 కోట్లు |
| సంవత్సరం | 2024 |
| సమకూరిన ఆదాయం | రూ. 59 కోట్లు |

| కుమ్రం భీం ఆసిఫాబాద్ | |
|---|---|
| సంవత్సరం | 2023 |
| సమకూరిన ఆదాయం | రూ. 79 కోట్లు |
| సంవత్సరం | 2024 |
| సమకూరిన ఆదాయం | రూ. 59 కోట్లు |



పారుపల్లి-లింగన్నపేట గ్రామాల మధ్య బ్రిడ్జి వద్ద విద్యుత్ లైన్ ఎత్తు పెంచాల్సిన స్థలం

# ఎమ్మెల్యేకు చెప్పినా బస్సు వస్తలే..

## జనగామ రూట్‌లో నడవని ప్రగతి రథ చక్రం

- ఇబ్బందులు పడుతున్న 10 గ్రామాల ప్రజలు
- తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం
- పారుపల్లి-లింగన్నపేట బ్రిడ్జిపైనున్న తీగల ఎత్తు పెంచితేనే నడిపిస్తామంటున్న ఆర్టీసీ
- శాసనసభ్యుని దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం

*ఆ మార్గంలో ఆర్టీసీ బస్సు సేవలు నిలిచిపోయి ఆరునెలలు దాటింది. 10 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టామని ప్రభుత్వం గొప్పలు చెప్పకుంటున్నా.. ఆ రూట్‌లో ఏ ఒక్క మహిళకూ ఉపయోగం లేకుండా పోయింది. 'జర మా సమస్య పట్టించుకోండి సారూ..' అని సాక్షాత్తూ ఎమ్మెల్యే వివేక్‌కు వినతి పత్రం ఇచ్చినా ఫలితం మాత్రం కానరాలేదు.*



జనగామ రూట్‌లో ఆర్టీసీ బస్సు నడిపించాలని ఎమ్మెల్యే వివేక్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు (ఫైల్)

కోటపల్లి, డిసెంబర్ 15 : మండలంలోని జనగామ రూట్‌లో ఆర్టీసీ బస్సు సేవలకు మోక్షం కలగడం లేదు. రోడ్డు బాగా లేదన్న సాకుతో పారుపల్లి, లింగన్నపేట, ఎదుల్లబంధం, సిర్సా, రొయ్యలపల్లి, పుల్లగామ, ఆలుగామ, జనగామ, సూపాక, నందరాంపల్లి గ్రామాల వైపు ఆరు నెలలుగా ఆర్టీసీ సేవలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తున్నది.

### తీగల ఎత్తు పెంచితేనే..

పారుపల్లి-లింగన్నపేట గ్రామాల మధ్యన ఉన్న ఒర్రెపైన బ్రిడ్జి నిర్మాణం చేపట్టగా, ఆ బ్రిడ్జి పై నుంచి 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ లైన్‌లు ఉన్నాయి. ఆ మార్గంలో బస్సు నడిపిస్తే విద్యుత్ తీగలు తగిలే ప్రమాదముందని ఆర్టీసీ చెబుతున్నది. విద్యుత్ తీగలు సరిచేస్తే బస్సు నడిపిస్తామని ఆర్టీసీ అధికారులు చెబుతుండగా, ఆర్అండ్‌బీ అధికారులు తమ సంస్థకు డబ్బులు చెల్లిస్తేనే సరి చేస్తామని విద్యుత్ అధికారులు అంటున్నారు. ఇక ఈ విషయమై ఆర్అండ్‌బీ అధికారులను అడిగితే తీగలు సరి చేసేందుకు విద్యుత్ శాఖ అత్యధిక అంచనాలు వేసిందని, ఆ డబ్బు ఇప్పుడు చెల్లించలేమని అంటున్నారని ఈ ప్రాంత నాయకులు చెబుతున్నారు. శాఖల మధ్య సమన్వయం లేకపోవడం, సమస్యను పరిష్కరించే నాథుడు లేకపోవడంతో 10 గ్రామాల ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ రెట్టింపు ఛార్జీలు చెల్లించి మరీ ప్రయాణిస్తున్నారు.

### ఎమ్మెల్యేకు చెప్పినా ఫలితం శూన్యం

జనగామ రూట్‌లో బస్సు నడవక ప్రజలు, మహిళలు పడుతున్న ఇబ్బందులను కోటపల్లి మండల వైస్ ఎంపీపీ, మాజీ సర్పంచ్ గట్టు లక్ష్మణ్ గౌడ్, ఆలుగామ మాజీ సర్పంచ్ కుమ్మరి సంతోష్, రాజారం మాజీ ఎంపీటీసీ, గిరిజన నాయకులు జేక శేఖర్, యువ కాంగ్రెస్ నాయకులు దాగామ శ్రీశైలం నవంబర్ 21న చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వివేక్‌కు వినతి పత్రం అందజేశారు. నేరుగా ఎమ్మెల్యేకు చెప్పడంతో సమస్య పరిష్కారమవుతుందని భావించిన స్థానిక నాయకులు, ప్రజలకు నిరాశే ఎదురైంది. స్వయంగా ఎమ్మెల్యేకు సమస్య విన్నవించినా పరిష్కారానికి నోచుకోవడం లేదంటే.. ఇక ఎవరూ పట్టించుకుంటారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### డబ్బులు చెల్లిస్తే తీగల ఎత్తు పెంచుతాం

పారుపల్లి-లింగన్నపేట గ్రామాల మధ్యన కల్వర్టు నిర్మించిన చోట విద్యుత్ తీగలు కిందకు ఉన్నాయి. ఆ తీగల ఎత్తు పెంచేందుకు ఆర్అండ్‌బీ అధికారులు మా సంస్థకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. మా సంస్థ వేసిన అంచనా ప్రకారం ఆర్అండ్‌బీ నిధులు చెల్లిస్తే వెంటనే తీగల ఎత్తు పెంచుతాం.

*- వెంకటేశ్వర్లు, ఏఈ, ట్రాన్స్‌కో*

### బస్సు నడుపుతలేరు



మా ఊరి నుంచి చెన్నూర్‌కు ఇది వరకు బస్సు నడిచేది. రోడ్డు మంచిగ లేదని కొన్ని రోజుల కింద బంద్ చేయించిన్రు. ఇప్పుడు రోడ్డు కూడా బాగైంది. అయినా బస్సు నడుపుతలేరు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం తీసుకొచ్చినా.. మాకు లాభం లేకుంటైంది. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్నం. డ్రైవర్లు అడిగినంత ఇచ్చుకోవాల్సి వస్తుంది. ఎమ్మెల్యే సారుకు ఇక్కడి నాయకులు వినతి పత్రం ఇచ్చినా ఫలితం లేదు.

*- కుమ్మరి సుమతి, రొయ్యలపల్లి*

# గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

**రామగుండం సీపీ శ్రీనివాస్**

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 15 : గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మంచిర్యాలలోని ఆర్‌బీహెచ్‌వీ స్కూల్, ఎస్ఆర్ఆర్ జూనియర్ కాలేజీ, వేంపల్లిలోని పరీక్షా కేంద్రాలను డీసీపీ భాస్కర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీపీ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో మొత్తం 66 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు జరుగుతున్నాయని, అన్ని కేంద్రాల వద్ద సెక్షన్-163 బీఎన్ఎస్ఎస్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షల అనంతరం ఎగ్జామ్స్ షీట్స్‌ను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే విషయంలో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. తమ పరిధిలోని 66 పరీక్షా కేంద్రాల నుంచి 15 రూట్లలో 411 మంది సిబ్బంది, అధికారులతో కలిసి తరలించడం జరుగుతుందన్నారు. స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సీపీ, డీసీపీలతో పాటు అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాశ్, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, సీఐ ప్రమోద్‌రావు, లక్షెట్టిపేట సీఐ నరేందర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేశ్‌కుమార్, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఉన్నారు.




మంచిర్యాలలోని పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్, డీసీపీ భాస్కర్

# రియల్ ధమాల్

**కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి** వచ్చిన ఏడాది కాలంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గృహాలు, ఓపెన్ ప్లాట్లు, వివాహాలు, ఇతర ఫర్మ్ రిజిస్ట్రేషన్‌ల మీద రావాల్సి ఆదాయం దాదాపుగా 15 శాతం తగ్గింది. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు రూ.174 కోట్ల ఆదాయం రాగా, ఇదే కాల పరిమితిలో గతేడాది 2023లో రూ.205 కోట్లు, 2022లో రూ.213 కోట్ల ఆదాయం సమకూరింది. గత రెండు, మూడేండ్లలో ఒక వెలుగు వెలిగిన రియల్ ఎస్టేట్ ప్రస్తుతం ఢీలా పడడంతో రియల్టర్‌లు రోడ్డు మీదకు వచ్చే పరిస్థితి నెలకున్నది. కొన్నాళ్లుగా జోరు మీదున్న స్థిరాస్తి రంగం నానాటికీ అధోగతికి చేరుకుంటున్నది. సాధారణ స్థితికి భిన్నంగా ఏడాదిన్నరగా స్థిరాస్తి వ్యాపారం అంతగా సాగడం లేదు. అమ్మేవారు తప్ప కొనేవారు ఎవరూ లేకపోవడంతో బిజినెస్ మందగించింది. వ్యవసాయ భూములతోపాటు వ్యవసాయేతర భూముల(ప్లాట్ల) అమ్మకాలు, కొనుగోళ్లు భారీగా తగ్గిపోయాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే రిజిస్ట్రేషన్, తహసీల్దార్ కార్యాలయాలు వెలవెలబోయి కనిపిస్తున్నాయి. భూముల ధరలు విపరీతంగా ఉండడం, కొన్న తర్వాత మళ్లీ పెరిగే అవకాశం కనిపించకపోవడం వంటి కారణాలతో రియల్ రంగం అంతకంతకు మందగిస్తోందని ఆ రంగంలోని నిపుణులు చెబుతున్న మాట. కాగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్‌లు తగ్గడంతో సర్కార్ ఆదాయానికి భారీగా కోత పడింది. హైడ్రా ద్వారా భూముల కొనుగోలుకు అంతగా ఆసక్తి చూపకపోవడంతో భూమి కొనుగోళ్లకు బ్రేక్ పడింది.

*- మంచిర్యాల, డిసెంబర్ 15(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



## కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తగ్గిన రిజిస్ట్రేషన్లు

## సర్కార్‌కు రావాల్సిన ఆదాయానికి గండి

**సర్కారుకు సమకూరిన ఆదాయం**

| సంవత్సరం | డాక్యుమెంట్లు | డబ్బులు |
|---|---|---|
| 2023 | 61,363 | రూ.205 కోట్లు |
| 2024 | 43497 | రూ.174 కోట్లు |

**జిల్లాలవారీగా రిజిస్ట్రేషన్లు**

| జిల్లా | ఆదిలాబాద్ |
|---|---|
| సంవత్సరం | 2023 |
| సమకూరిన ఆదాయం | రూ.62కోట్లు |
| సంవత్సరం | 2024 |
| సమకూరిన ఆదాయం | రూ.32 కోట్లు |

**నిర్మల్ జిల్లా**

| | |
|---|---|
| సంవత్సరం | 2023 |
| సమకూరిన ఆదాయం | రూ.64కోట్లు |
| సంవత్సరం | 2024 |
| సమకూరిన ఆదాయం | రూ.29 కోట్లు |

# మిథనాల్ ప్లాంట్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

- సింగరేణి సీఎండీ బలరాం
- ఎస్టీపీపీలో అధికారులతో సమీక్ష

జైపూర్, డిసెంబర్ 15 : ఎస్టీపీపీలో ఏర్పాటు చేస్తున్న మిథనాల్ ప్లాంటు నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సింగరేణి సీఎండీ బలరాంనాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఎస్టీపీపీని సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెలాఖరులోగా మిథనాల్ ప్లాంటును ప్రారంభించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్లాంట్ నుంచి వెలువడే కార్బన్‌డయాక్సైడ్‌ను హైడ్రోజన్‌లో మిళితం చేసి మిథనాల్‌ను తయారు చేసుకోవచ్చని తెలిపారు. దీని ద్వారా సింగరేణికి అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని పేర్కొన్నారు. ఇక్కడ తయారైన మిథనాల్‌ను పెయింట్స్, ప్లాస్టిక్, ఫెర్టిలైజర్స్‌వంటి పరిశ్రమలకు అందించి సంస్థకు అదనపు ఆదాయాన్ని సమకూర్చవచ్చని తెలిపారు. అనంతరం హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు, వనాలను పరిశీలించారు. అంతకు ముందు ఎస్టీపీపీ ఆవరణలో రిజర్వాయర్ ప్రాంతంలో 209 మొక్కలు నాటారు. దీంతో సింగరేణి వ్యాప్తంగా ఇప్పటి వరకు 18500 మొక్కలు నాటినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈడీ రాజశేఖర్, శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణ, జీఎం పీసీఎస్ శ్రీనివాసులు, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ యోగేష్‌ఫర్మార్, ఏజీఎం సివిల్ కేఎన్ ప్రసాద్, డీజీఎం పంతుల, పర్సనల్ అధికారి తుకారాం పాల్గొన్నారు.

### ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

మందమర్రి, డిసెంబర్ 15 : బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమష్టిగా కృషి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం సూచించారు. మందమర్రి ఏరియాలోని కేకే ఓసీని ఆదివారం ఆయన సందర్శించారు. కేకే ఓసీ వద్ద ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ సీఎండీ బలరాంకు పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన వ్యూపాయింట్ నుంచి ఓసీ పరిసరాలు, పని స్థలాలను పరిశీలించారు. ఓసీలో ఉత్పత్తి వివరాలను జీఎంను అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వ్యూపాయింట్ వద్ద మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా జీఎం దేవేందర్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ, కేకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### శ్రీరాంపూర్ ఓసీపీ సందర్శన

శ్రీరాంపూర్, డిసెంబర్ 15 : శ్రీరాంపూర్ ఓసీపీని సీఎండీ బలరాం ఆదివారం సందర్శించారు. జీఎం ఎల్‌వీ సూర్యనారాయణతో కలిసి ఓసీపీ క్వారీ, ఓబీ డంప్‌యార్డును పరిశీలించారు. అనంతరం పీవో శ్రీనివాస్‌తో కలిసి ఓసీపీ ఉత్పత్తి పనిస్థలాలను పరిశీలించారు. సీఎండీ మాట్లాడుతూ ఉత్పత్తి, రవాణాకు సమప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓసీపీ మేనేజర్ బ్రహ్మాజీ, సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, సర్వే ఆఫీసర్ సంపత్, సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి పాల్గొన్నారు.



మందమర్రి కేకేఓసీ వ్యూపాయింట్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న సీఎండీ బలరాం



అధికారులతో కలిసి మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఎండీ

# నేటి నుంచి సమ్మెలోకి సీఆర్టీలు

కోటపల్లి, డిసెంబర్ 15 : గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీఆర్టీల ఆధ్వర్యంలో ఈ నెల 13న సమ్మె నోటీస్‌ను ఉన్నతాధికారులకు అందజేశారు. నేటి నుంచి సమ్మెలో పాల్గొంటున్నట్లు ఆ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చెడంక బాపురావ్, ప్రధాన కార్యదర్శి బద్ది శ్రీనివాస్, కృష్ణంరాజు పేర్కొన్నారు. మినిమమ్ టైం స్కేల్, వేతనాల బకాయిలు, ఉద్యోగ భద్రత, మహిళా ఉపాధ్యాయులకు ప్రసూతి సెలవులు, తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నట్లు వివరించారు. సోమవారం నుంచి ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ముందు ధర్నాలో పాల్గొనున్నట్లు వివరించారు.



మంచిర్యాల డీటీడీవోకు సమ్మె నోటీస్ అందజేస్తున్న సీఆర్టీలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

# గ్రూప్- 2 పరీక్షలు ప్రశాంతం

నస్పూర్, డిసెంబర్ 15 : మంచిర్యాల జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం జిల్లాకేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ కుమార్ దీపక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించామన్నారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 7363 మంది, సాయంత్రం 7,446 మంది హాజరయ్యారని తెలిపారు. కొన్నిచోట్ల ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించలేదు.

### గ్రూప్-2 పకడ్బందీగా నిర్వహించాలి

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 15 : గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించామన్నారు. అనంతరం ఆదర్శ పాఠశాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ పీటీజీ గురుకులంతో పాటు మాతృశ్రీ కాలేజ్ తదితర పరీక్షా కేంద్రాలను సందర్శించారు. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, ఆసిఫాబాద్ డీఎస్పీ కరుణాకర్ ఉన్నారు.

### స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తు

గ్రూప్-2 పత్రాలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద పూర్తి స్థాయి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), పరీక్షల నోడల్ అధికారి దీపక్ తివారీతో కలిసి పరిశీలించారు.



స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే